సాక్షి ప్రకాశం

మంగళవారం । 12 । నవంబర్ । 2024



ప్రజా సమస్యలు పరిష్కరించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. - 8లో..



క్షణికావేశం..తీసింది ప్రాణం

కుటుంబ కలహాల నేపథ్యంలో కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కాపురంలో ఆదివారం రాత్రి జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
32.9/25


వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

మెరవని హామీలు పారని నిధులు

కూటమి తొలి బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు అన్యాయం జరిగింది. జిల్లాలో ప్రధాన సాగు నీటి ప్రాజెక్టులుగా ఉన్న వెలుగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులకు నిధుల కోత పెట్టింది. వెలుగొండ ప్రాజెక్టు నుంచి నీరిచ్చేది మేమే అంటూ ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రగల్భాలు పలికారు. తీరా బడ్జెట్‌లో అరకొరగా నిధులు విదిల్చారు. రైతుకు పెట్టుబడి సాయం నిధుల కేటాయింపులో భారీగా కోత వేసింది. తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయించకుండా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేసింది. ఇక మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు, మహిళలకు నెలకు రూ.1500 తదితర సంక్షేమ పథకాల ఊసే లేదు.







- ప్రాధాన్యత రంగాలకు మొండిచేయి
- అన్నదాతకు లేదు సుఖీభవ
- తల్లికి వందనం లేదు
- నిరుద్యోగులకు రిక్తహస్తం
- ఉచిత బస్సు తుస్సు
- రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల పెదవి విరుపు

ప్రధాన జల ప్రాజెక్టులకు నిధుల కోత

వెలుగొండకు కొంతే..గుండ్లకమ్మకు అత్తెసరు

సాక్షిప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల తర్వాత తొలిసారిగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు నిరాశే మిగిల్చింది. కీలక వ్యవసాయ, సాగునీటి ప్రాజెక్టులకు అత్తెసరు నిధులు కేటాయించగా, పేదల సంక్షేమాన్ని పక్కన పెట్టేసింది. అత్తెసరు నిధుల కేటాయింపులపై జిల్లా వాసులు నిట్టూరుస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టుకు, గుండ్లకమ్మ ప్రాజెక్టుకు అత్యధిక నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయగా సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వెలుగొండకు అన్యాయం జరిగిందనే చెప్పాలి. కేటాయించిన రూ.393 కోట్లలో సింహభాగం సిబ్బంది జీతాలకే సరిపోతుందని నిపుణులు అంటున్నారు. మిగిలిన నిధులతోనే ఆర్‌ఆర్ ప్యాకేజీ, కాలువల అభివృద్ధి తదితర పనులను చేపట్టాల్సి ఉంటుంది. కేటాయింపులే తక్కువ ఉంటే ఇక ప్రాజెక్టు ఎంత వేగంగా పూర్తవుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇటీవల జిల్లాకు వచ్చిన ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ''మేము నాటకాలాడం..మోసం చేయం'' అంటూ ప్రకటన చేశారు. మరి ఈ కేటాయింపులు ఏంటి మంత్రిగారూ అంటూ జనం నిలదీస్తున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు సైతం రూ.13 కోట్లు మాత్రమే నిధులు కేటాయించింది. రామతీర్థం, సంగమేశ్వరం ప్రాజెక్టుల ఊసే లేకపోవడంపై వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సమయంలో దొనకొండను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఆ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. అయితే బడ్జెట్‌లో ఒక్కరూపాయీ విదల్చలేదు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుపేదలకు 3 సెంట్లు, 2 సెంట్లు భూమి కేటాయిస్తామని చెప్పారని, ఈ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంపై జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు. అలాగే మత్స్యకారుల సంక్షేమాన్ని సైతం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. వేట విరామ సాయం ఇంతవరకూ అందలేదు.

తల్లికి వందనం మరిచారు...



ఎన్నికలకు ముందు నీకు 15..నీకు 15..నీకు 18...అంటూ ప్రచారంలో ఊదరగొట్టిన కూటమి నాయకులు సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తల్లికి వందనాన్ని మర్చిపోయారు. జిల్లాలో మొత్తం సుమారుగా 2,89,783 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. రూ.15 వేల ప్రకారం రూ.434,67,45,000 చెల్లించాల్సి ఉంది. బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌లో ప్రధానమైన తల్లికి వందనాన్ని మర్చిపోయినట్టు ఉందని జిల్లా ప్రజలు అంటున్నారు.

నిరుద్యోగులకు పంగనామం...




అధికారంలోకి రాగానే ఉద్యోగాల ప్రకటన, నిరుద్యోగ భృతి అంటూ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ఊరూరా తిరిగి హామీలిచ్చారు. సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ఊసే లేదు. జిల్లాలో సుమారు 2,08,350 మంది నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. తాము అధికారంలోకి వస్తే ప్రతి నెలా నిరుద్యోగులకు రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ లెక్కన ప్రతి నెలా రూ.62,50,50,000 చెల్లించాలి. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రకటన లేకపోవడంతో ఈ ఏడాది నిరుద్యోగుల నోట్లో సున్నం కొట్టినట్టే.

మహిళలకు రూ.1500 ఎప్పుడు...

అధికారంలోకి రాగానే 19 నుంచి 59 వయస్సున్న ప్రతి మహిళకు ప్రతినెలా రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నట్లు అంచనా. ఈ లెక్కన ప్రతి నెలా 4 కోట్ల 50 లక్షల రూపాయలు ఇవ్వాలి. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటినా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన లేకపోగా బడ్జెట్‌లో కూడా దాని ఊసే లేదు.



ఉచిత బస్సు అంతేనా...?




టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే మహిళలందరూ ఉచిత బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి సంబంధించి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ త్వరలో అమలు చేస్తామని చెప్పాడే కానీ, ఎంత కేటాయించేదీ చెప్పలేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 11,02,821 మంది మహిళలు ఉచిత బస్సుకోసం ఎదురు చూస్తున్నారు.

సూపర్ సిక్స్‌కూ కోతే..



గత ప్రభుత్వం కంటే మిన్నగా సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను అందిస్తామని చెప్పి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఆరంభంలోనే పేద వర్గాలకు మొండిచేయి మిగిల్చింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పన సాయం చేస్తానని, ప్రతి బిడ్డకు అమ్మకు వందనం కింద రూ.15 వేలు, అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తానని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ఆశ చూపి మోసం చేసింది. కూటమి ప్రభుత్వ తీరుపై జిల్లా ప్రజలు మండిపడుతున్నారు.

అన్నదాతకు దక్కని భరోసా...



జిల్లా వ్యాప్తంగా 2,96,889 మంది రైతులు ఉన్నారు. అన్నదాత సుఖీభవ కింద కూటమి ప్రభుత్వ హామీ ప్రకారం ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేలు ఇవ్వాలి. జిల్లావ్యాప్తంగా ఉన్న రైతులకు రూ.593,77,80,000 కేటాయించాల్సి ఉంది. బడ్జెట్‌లో కేటాయింపుల ప్రకారం జిల్లా వాటా అరకొరగా ఉందని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలించక సాగు విస్తీర్ణం తగ్గించుకుంటున్న రైతులకు ప్రభుత్వ నిర్ణయం శాపంగా మారనుంది. కేటాయించిన నిధులు సైతం ఎప్పటి నుంచి ఇస్తారో కూడా స్పష్టత లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సూపర్ సిక్స్‌కు మొండి చేయి



రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కు మొండి చేయి చూపించారు. బడ్జెట్ వాస్తవాలకు దూరంగా ఉంది. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ప్రయత్నం చేయలేదు. రైతులకు షాక్ ఇచ్చారు. అంకెల గారడీ తోటి ప్రజలను మభ్యపెట్టారు. నేను మారను గాక మారను అన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు... కూటమి ప్రభుత్వం విధానం. వెరసి రాష్ట్ర ప్రజానీకాన్ని నిలువునా మోసం చేసి ప్రజలు మళ్లీ జగనన్న పరిపాలనను చూడాలన్న భావన తీసుకొచ్చింది.

– **డాక్టర్ ఆదిమూలపు సురేష్**, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు

ఎన్నికల హామీలను మరిచారు



ఎన్నికల ముందు కూటమి నాయకులు అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే ఈ బడ్జెట్‌లో చూస్తే ఇచ్చిన హామీలన్నీ అమలయ్యేలా కనిపించడం లేదు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ లాగా భావించి అమలుచేస్తే కూటమి నాయకులు మాత్రం మర్చిపోయినట్టు ఉన్నారు. ప్రజలను మోసం చేయొద్దు. అన్నీ గమనిస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలను కచ్చితంగా అమలు చేయాల్సిందే.

– **అన్నా రాంబాబు**, మాజీ ఎమ్మెల్యే

ప్రజలపై భారం మోపే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంకెలు ఘనంగా ఉన్నాయి కానీ ద్రవ్య లోటును ఎలా పూడ్చుకుంటారో చెప్పలేదు. జలవనరులకు రూ.16,705 కోట్లు కేటాయించారు. ఇది ఏ మూలకు సరిపోదు. ఒక్క వెలుగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కేటాయించాలి. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గుండ్లకమ్మ, రామతీర్థం, సంగమేశ్వరం ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి. ప్రభుత్వం తీరు చూస్తే వెలుగొండ ప్రాజెక్టును అటకెక్కించినట్లు అర్థం చేసుకోవచ్చు. ఈ బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి అరకొరగా నిధులు కేటాయించారు. సూపర్‌సిక్స్ నిధుల విషయంలో ప్రభుత్వం మాయ చేస్తోంది. ఇది ముమ్మాటికీ ప్రజలపై భారం మోపే బడ్జెట్.

– **సయ్యద్ హనీఫ్**, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఇది మోసపూరిత బడ్జెట్



ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ప్రకాశం జిల్లాకు ఒరిగిందేమీ లేదని, ఈ బడ్జెట్ జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని.. ఇది కేవలం అంకెల గారడీ బడ్జెట్ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత వరప్రదాయిని అయిన వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. మార్కాపురంలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ కాలేజీకి నిధులు ఏవని ప్రశ్నించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు అభివృద్ధికి నిధుల కేటాయింపు శూన్యమన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తామని ప్రకటించి, ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.4500 కోట్లు కేటాయించినట్లు చూపించి, అందులో వెయ్యి కోట్లు స్టేట్ గవర్నమెంట్ నుంచి, రూ.3500 కోట్లు పీఎం కిసాన్ నుంచి కేటాయించారన్నారు. కేవలం రూ.వెయ్యి కోట్లతో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎలా అమలు చేస్తారో చెప్పాలన్నారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయిస్తే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇచ్చే పరిస్థితి లేదని, తల్లికి వందనం ఎగనామం పెట్టే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేకపోతే పథకం లేనట్టేనా అని ప్రశ్నించారు.

ఆర్థిక పుష్టిలేని అంకెల గారడీ



కూటమి ప్రభుత్వంపై ఆశగా ఎదురు చూసిన పేదలకు మొండి చేయి చూపినట్లు బడ్జెట్ ఉంది. ఆర్థిక పుష్టి లోపించి అంకెల గారడీగా మారింది. కేవలం రెండు పథకాలకు అరకొరగా నిధులు విడుదల చేస్తూ మిగిలిన పథకాలకు తిలోదకాలు పలికింది. ఈ ఏడాదికి ఆ పథకాలను అటకెక్కించారు. పేదల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఈ బడ్జెట్ ఏ మాత్రం ఆదుకునే పరిస్థితి లేదు. ఆర్థిక వృద్ధి గడచిన ఆరు నెలల్లో నెగిటివ్ వృద్ధి నమోదు చేస్తే రాబోవు 6 నెలల్లో విపరీత వృద్ధిని చూపిస్తూ ఏ విధంగా అభివృద్ధి నమోదవుతుందో ప్రకటించకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో అనేక పథకాలకు అర్థ రూపాయి కూడా విడుదల చేయకపోవటాన్ని చూస్తే ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను ఎంత మోసం చేస్తుందో అర్థమవుతుంది.

– **తాటిపర్తి చంద్రశేఖర్**, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి.

హామీలు తుంగలో తొక్కారు



రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్ ఎన్నికల హామీలను తుంగలోకి తొక్కినట్లుంది. సూపర్ సిక్స్ కేవలం ఎన్నికల నినాదంగా మిగిలిపోతుంది. 19 నుంచి 59 ఏళ్ల వయసున్న మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మహిళలకు ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్నారు. కానీ ఈ బడ్జెట్లో వాటికి ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం ప్రజలను వంచించడమే. తల్లికి వందనం పథకానికి రూ.2491 కోట్లు విదిలించారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. దాన్నీ విస్మరించారు.

– **చిట్టిపాటి వెంకటేశ్వర్లు**, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి

జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు...



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఒట్టి మాటల గారడీ బడ్జెట్. జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. నీటి వనరుల శాఖకు అరకొర నిధులు కేటాయించారు. అవి ఆ శాఖ ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవు. ఇక ప్రాజెక్టుల నిర్మాణం ఎలా చేపడతారో వారికే తెలియాలి. మొత్తం మీద ప్రకాశం జిల్లా ఆశా కిరణం వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం తిరిగి అటకెక్కే పరిస్థితి కనిపిస్తోంది. ఇక ఏ ఒక్క సంక్షేమ పథకానికి కూడా నిధులు కేటాయించలేదు. ఎన్నికలకు ముందు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తామన్నారు. వాటికి బడ్జెట్లో నిధులు కేటాయించలేదు.

– **ఎంఎల్ నారాయణ**, సీపీఐ జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తాటిపర్తి



ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యర్రగొండ పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పదవిగా కాకుండా బాధ్యతగా తీసుకొని పార్టీ పటిష్టతకు నిరంతరం పోరాడతానన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళతానని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

పశ్చిమ ప్రాంత అభివృద్ధికి సహకరించండి



సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు బొకే అందిస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం: పశ్చిమ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌ను కోరారు. సోమవారం రాత్రి డాక్టర్ సురేష్ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి త్రివినాగ్‌కు బొకే అందించారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం, ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో అభివృద్ధి, రోడ్ల అభివృద్ధి, మార్కాపురం జిల్లా ప్రతిపాదన తదితర అంశాలపై ఆయన సబ్‌కలెక్టర్‌తో మాట్లాడారు. జిల్లాలో పశ్చిమ ప్రకాశం పూర్తిగా వెనుకబడిందని, వెలుగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తిచేసి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి నీటిని వదిలితే శాశ్వతంగా కరువు సమస్య తీరుతుందని అన్నారు. ఈ దిశగా ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుందని, అందుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేయాలని సురేష్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం




కనిగిరి రూరల్: ఈనెల 8, 9, 10 తేదీల్లో జగ్గయ్య పేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కనిగిరికి చెందిన తమ్మినేని రాజశేఖరరెడ్డి 74 కేజీల జూనియర్ విభాగంలో బంగారు పతాకం సాధించాడు. రాజశేఖరరెడ్డి డిసెంబర్ 10న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ప్రభాస్ ఫిట్‌నెస్ అకాడమీ వారు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి స్ట్రాంగ్ మ్యాన్ టైటిల్‌ను దక్కించుకున్న తమ్మినేని రాజశేఖరరెడ్డిని ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ప్రభాస్ ఫిట్నెస్ అకాడమీ సభ్యులు, ఖాదర్ షరీఫ్ తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టీంకు మోక్షజ్ఞ ఎంపిక



ఒంగోలు: మణిపూర్‌లో వచ్చే నెల 20 నుంచి జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ గేమ్స్‌కు ఒంగోలుకు చెందిన కొండపాటూరి సాయి మోక్షజ్ఞ ఎంపికయ్యాడు. ఈనెల 8, 9, 10 తేదీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మోక్షజ్ఞ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా నుంచి జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రాష్ట్ర టీముకు ఎంపికయ్యాడు.

కర్రసాములో మార్కాపురం విద్యార్థికి గోల్డుమెడల్



మార్కాపురం: పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థి వరుణ్ సౌత్ జోన్ శిలంబం (కర్రసాము) ఛాంపియన్ షిప్ 2024లో గోల్డు మెడల్ సాధించాడు. గుంటూరులో జరిగిన ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ శిలంబం అసోసియేషన్ వారు నిర్వహించారు. జిల్లా నుంచి వరుణ్ పాల్గొని గోల్డుమెడల్ సాధించాడు.

విద్యతోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: విద్యతోనే కుటుంబం, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా ఒంగోలు పాత మార్కెట్ సెంటర్‌లో ఉన్న అజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడు జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అన్నారు. అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని అన్నారు. ప్రకాశం జిల్లా వెనుకబడిన జిల్లాగా ఉందని, అక్షరాస్యత 62 శాతం మాత్రమేనన్నారు. జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ 11 సంవత్సరాల పాటు ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా పనిచేసి అనేక విద్యా సంస్కరణలను తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని గాంధీజీ అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి ఆజాద్ అన్నారు. కార్యక్రమంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన బండ్లమిట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కపిల్ బాషా, అనీఫ్ ఖాన్, ఎస్కే సైదా తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలి

ఒంగోలు అర్బన్: నిర్దేశించిన మేరకు జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి హామీ పనులతో పాటు గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం, కోర్టు కేసులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పనులు, హౌసింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సీసీరోడ్లు, సైడు కాలువలు, ఇంకుడు గుంతల నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్, ఫారంపాండ్ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి ఎటువంటి జాప్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టైంబౌండ్ కేసులు, డైరెక్షన్, ధిక్కార, రిట్ పిటిషన్లపై శాఖల వారీగా ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ ఓబులేసు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు, డ్వామా పీడీ జోసఫ్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ వెంకటనాయుడు, డీఎంహెచ్ఓ సురేష్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ భరద్వాజ్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించేందుకు కృషి చేయాలని ఎస్పీ దామోదర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో అండర్-11 బాలబాలికల బ్యాడ్మింటన్ పోటీలను ఎస్పీ లాంఛనంగా ప్రారంభించారు. ప్రకాశం, తూర్పు గోదావరి, గుంటూరు, అనంతపురం, చిత్తూరు, కృష్ణ, కడప, కర్నూలు, నెల్లూరు, శ్రీకాకుళం, విజయవాడ, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి పోలీసుశాఖ తరపున రూ.2 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1000 అందిస్తామని ఎస్పీ ప్రకటించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అంకమ్మ చౌదరి, ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఎల్‌పీటీ పరీక్షలు

ఒంగోలు సిటీ: లాంగ్వేజ్ పండిట్ ట్రెనింగ్ కోర్సు థియరీ పరీక్షలు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు బ్రాడీపేటలో ఎస్.ఎన్ గవర్నమెంట్ హైస్కూల్‌లో జరుగుతుందని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ 14 నుంచి 20 వ తేదీ వరకు డీ.ఈఐ.ఈడీ సెకండ్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షలు ఒంగోలు సంతపేటలోని డి.ఆర్.ఆర్.ఎం మునిసిపల్ హైస్కూల్‌లో జరుగుతాయని చెప్పారు. హాల్ టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

రేపు జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

చీమకుర్తి: జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల 13వ తేదీ చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ హజీరాబేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 బాలబాలికలకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. స్కూలు పీడీలు స్వరూపావాణి, శ్రీనివాసరెడ్డి, కౌసల్యాదేవి ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలో సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాల, గిద్దలూరు, కందుకూరు, మార్కాపురం, అద్దంకి, దర్శి, కనిగిరి, పొదిలిలో ఒక్కో పోస్టు, ఒంగోలులో 3 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. రాష్ట్ర న్యాయశాఖలో పనిచేసి రిటైరైన, రాజీనామా చేసిన వారు, న్యాయశాఖలో మినిస్టీరియల్ విభాగంలో సూపరింటెండెంట్ కేటగిరీలో పనిచేసి రిటైరైన వారు, హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ న్యాయ విద్య పట్టా కలిగిన వారు, కనీసం అడ్వకేట్‌గా 5 సంవత్సరాలు అనుభవం ఉండి ప్రస్తుతం బార్ కౌన్సిల్‌లో సభ్యులు కాని వారు, గజిటెడ్ హోదాలో పనిచేసి రిటైరై లా డిగ్రీ కలిగిన వారితోపాటు పలు అర్హతలు కలిగిన వారు డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు పంపాలన్నారు. గౌరవ వేతనంగా రూ.45 వేలు, కన్వీయన్స్ కింద మరో రూ.5 వేలు చెల్లిస్తారని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకుంటే వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి బీపీసీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఒంగోలు సిటీ: ఐసీడీఎస్‌లో కాంట్రాక్టు పద్ధతిపై బ్లాక్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ (బీపీసీ) పోస్టులకు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ పీడీ కె.మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోర్నాలలో 1, గిద్దలూరులో 1 చొప్పున రెండు పోస్టులున్నట్లు తెలిపారు. దోర్నాలలో బీసీ–ఈ ఉమెన్‌కు, గిద్దలూరులో ఎస్టీ ఉమెన్‌కు పోస్టులు కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జూలై 1, 2024 నాటికి 25 సంవత్సరాలు నిండి 42 సంవత్సరాలు దాటకుండా ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఒంగోలులోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో గల డ్రాప్ బాక్సులో వేయాలని సూచించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 90 ఫిర్యాదులు

ఒంగోలు టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 90 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు ఎస్పీని కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. రాతపూర్వక ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ.. సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే తగిన విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ ఎస్.సురేష్ బాబు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, డీసీఆర్బీ సీఐ దేవప్రభాకర్, తాలూకా సీఐ అజయ్ కుమార్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ కీచకుడు ఇతడే!

- బాలికపై లైంగిక దాడి ఘటనలో కీలక మలుపు
- ఉపాధ్యాయుడి ఫొటోను గుర్తు పట్టిన బాలిక
- ఉపాధ్యాయుడిని అదుపులో తీసుకునేందుకు పోలీసుల తాత్సారం
- 'ముఖ్య' నేత సామాజికవర్గం కావడంతోనే చర్యలకు మీనమేషాలు
- ఉపాధ్యాయుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్న బాలిక తల్లి
- న్యాయం జరిగే వరకు పోరాడతామన్న వరికూటి అశోక్‌బాబు


బాలిక కుటుంబసభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న వరికూటి అశోక్‌బాబు

టంగుటూరు: టంగుటూరు మండలం ఓ గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చెందిన బాలికపై లైంగిక దాడి ఘటన సోమవారం మరో మలుపు తిరిగింది. ఇప్పటివరకు బాలిక ఒక్కోసారి ఒక్కో మాట చెబుతోందంటూ పోలీసులు చెబుతూ వచ్చారు. అయితే సోమవారం పోలీసులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలను చూపించారు. ఆ రోజు తనపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిని బాలిక గుర్తించింది. అయితే ఇప్పటి వరకూ ప్రచారంలో ఉన్న వ్యక్తి కాకుండా కొత్త వ్యక్తి కావడం గమనార్హం. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సమక్షంలో బాలిక సదరు ఉపాధ్యాయుడి ఫొటోను గుర్తించి తనపై లైంగిక దాడికి పాల్పడింది అతనే అని చూపించినా.. డీఎస్పీ పలుమార్లు...ఇతనేనా...ఇతనేనా...అంటూ అడగడంతో బాలిక అసహనానికి గురైంది. మీకు ఎన్నిసార్లు చెప్పాలి నాపై లైంగిక దాడి చేసింది ఈయనే అని స్పష్టం చేసింది. 'నన్ను ఆడుకోనీయటం లేదు, ఎవరితో మాట్లాడనీయటం లేదు. నేను తప్పు చేసినట్లు నన్ను, మా అమ్మ గదిలో బంధించి ఇబ్బంది పెడుతున్నారు' అంటూ వాపోయింది. ఇదే విషయాన్ని సోమవారం బాలిక తల్లి ఆడియో రూపంలో తమపై జరుగుతున్న అన్యాయాన్ని సామాజిక మాధ్యమాల్లో బయటపెట్టింది.

తల్లి కథనం ప్రకారం.. ఎప్పటిలాగే తన కుమార్తె బుధవారం పాఠశాలకు వెళ్లిందని, సాయంత్రం ఆటస్థలంలో ఆడుకుంటుండగా స్నేహితురాలు వచ్చి సార్ పిలుస్తున్నారు అంటూ పిలుచుకు వెళ్లిందని తెలిపింది. వారు వెళుతున్న సమయంలో పాఠశాల పీఈటీ టీచర్ సైతం అక్కడే ఉంది. ఎక్కడకు వెళుతున్నారని వారిని అడిగిందని, సార్ పిలుస్తున్నారంటూ వారు చెప్పారన్నాని పేర్కొంది. సార్ దగ్గరకు వెళ్లాక మా పాపతో పాటు వెళ్లిన అమ్మాయిని బయటకు పంపేసి ఈ దారుణానికి ఒడిగట్టాడని ఆరోపించింది. గురువారం ఉదయం పాపకు రక్తస్రావం అవుతుండడాన్ని గమనించి ఆరా తీస్తే తనపై జరిగిన అఘాయిత్యాన్ని తెలిపిందన్నారు. వెంటనే తాము స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లామని, అక్కడ వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. అక్కడ నుంచి ఒంగోలు జీజీహెచ్‌కు వెళ్లామన్నారు.

పోలీసుల తీరుపై అనుమానాలు?

బాలికపై లైంగికదాడి జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థిపై ఘాతుకానికి పాల్పడిన ఉపాధ్యాయుడు, విద్యాశాఖా మంత్రి, ఒంగోలు డీఎస్పీ, సీఐ, ఎస్సై, చివరికి బందోబస్తు నిర్వహించిన కానిస్టేబుల్ కూడా టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వారు కావటంతో కేసు నీరు కార్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రజా సంఘాలు, దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. పోలీసులు కూడా నిన్నటివరకు బాలిక టీచర్ పేరు చెప్పలేదని దీంతో గుర్తు తెలియని ఉపాధ్యాయుడుగా పోక్సో కేసు నమోదు చేశామని చెబుతూ వచ్చారని, సోమవారం సదరు బాలిక పాధ్యాయుడిని గుర్తు పట్టినా అతన్ని అరెస్టు చేసేందుకు ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని దళిత సంఘాల నేతలు నిలదీస్తున్నారు. ఇతను గతంలో కందుకూరులో పనిచేసినప్పుడు అక్కడ కూడా ఇదే ఘటనలో సస్పెండ్ అయ్యాడని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. నేరచరిత్ర కలిగిన ఇలాంటి ఉపాధ్యాయుడిపై పోలీసులు ఎందుకు సానుభూతి చూపిస్తున్నారో అర్థం కావటం లేదని వారు అంటున్నారు.

నా మనమరాలికి న్యాయం జరగాలి

నా మనుమరాలైన బాధిత బాలికకు అన్యాయం జరిగితే సహించేది లేదని, ఉద్యమిస్తానని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాను ఎప్పుడు పేదల పక్షాన, న్యాయం తరపున పోరాటాలు చేస్తానని చివరికి తన మనుమరాలికే అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. తాను వైఎస్సార్‌సీపీ తరపున కాదని, బాలికకు బంధువుగా న్యాయం చేయమని కోరుతున్నానని అశోక్‌బాబు తెలిపారు. సోమవారం రాత్రి బాలిక కుటుంబాన్ని వరికూటి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. మీడియాతో మాట్లాడుతూ లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి దగ్గర నుంచి విద్యాశాఖా మంత్రి, డీఎస్పీ, సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ కూడా టీడీపీ సామాజిక వర్గం వారేనని ఆరోపించారు. టీచర్‌ను బాలిక గుర్తిస్తే అరెస్టుకు పోలీసులు ఎందుకు సంకోచిస్తున్నారు. పథకం ప్రకారం ఎస్సీ ఉపాధ్యాయుడిని కేసులో ఇరికించే ప్రయత్నం చేశారని ఇంతకంటే మరొక దుర్మార్గం ఉంటుందా అని ప్రశ్నించారు.

> **విచారణ నిష్పక్షపాతంగా చేయాలి**
>
> బాలికపై లైంగిక దాడికి కేసును పోలీసులు నిష్పక్షపాతంగా విచారించాలి. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఘటన జరిగితే మంత్రి స్వామి ఇంత వరకు బాలికను పరామర్శించకపోవడం దారుణం. బాలికకు న్యాయం చేయకుండా అధికారులు, పోలీసులను మంత్రి స్వామి వెనుకేసుకొని రావడం దురదృష్టకరం. ఎస్పీ పర్యవేక్షణలో విచారణ నిష్పక్షపాతంగా చేయాలి. బాలిక కుటుంబాన్ని ఎవ్వరూ బెదిరించకుండా పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలి. బాలికకు న్యాయం చేయాలి.
>
> – ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ అధ్యక్షుడు

> **నాలుగు రోజులు నరకం చూపించారు**
>
> నా కూతురుపై లైంగిక దాడి జరిగిందని చికిత్స కోసం జీజీహెచ్‌కు గురువారం వెళ్లామని, ఈ విషయం తెలిసిన పోలీసులు ఆస్పత్రికి వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకు మాకు నరకం చూపించారని బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. మావద్దకు మహిళా ఎస్సై అనిత వచ్చి మీ వద్దకు ఎన్నిసార్లు రావాలి, పెద్ద వాళ్లతో పెట్టుకుంటున్నారు మిమ్మల్ని చంపేస్తారు అంటూ బెదిరించిందని, ఈమెకు కానిస్టేబుల్ కూడా వంత పాడిందని ఆరోపించారు. మేము మొదటి నుంచి టీచర్ అని చెబుతున్నామే కానీ ఎవరి పేరు చెప్పలేదని ఈరోజు ఫొటోలు చూపిస్తే నా కూతురు లైంగిక దాడి చేసిన వ్యక్తిని గుర్తించిందని వివరించింది. అయితే పోలీసుల విచారణలో సదరు టీచరు పేరు తెలిసినా మరో టీచర్‌ను ఇరికించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ సామాజిక వర్గానికి చెందిన వాడు కావటంతో పోలీసులు మీనమేషాలు లెక్కపెడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

బాల్య వివాహాలు నివారించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలని, అందుకు ప్రణాళికాబద్ధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో బంగారు బాల్యం కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. చిన్నారుల బాల్యం బంగారుమయం కావాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత డివిజన్ల వారీగా ఎంపిక చేసిన గ్రామాలను చైల్డ్ ఫ్రెండ్లీ విలేజెస్‌గా మార్చడంపై దృషి సారించాలన్నారు. జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నివారించాలన్నారు. ఈ నెల 14వ తేదీ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాల్య వివాహాల నివారణ, బాలల హక్కులు, వారి రక్షణకు ఉన్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఉన్న అవకాశాలు, తదితర అంశాలపై వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలన్నీ భాగస్వాములై సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం గ్రామస్థాయిలో, రెండో శుక్రవారం మండల స్థాయిలో, మూడో శుక్రవారం డివిజన్ స్థాయి, నాల్గో శుక్రవారం జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మిషన్ శక్తి పథకంలో భాగంగా సంబంధిత శాఖలన్నీ బాలల సర్వతోముఖాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి బాలలంతా బడికెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్యాంబాబు, డీఆర్ఓ చిన ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ మాధురి, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ రామాంజనేయులు, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు రవికుమార్, వసుంధర, కార్మిక శాఖ సహాయ కమిషనర్ కనకదుర్గ, బీసీ సంక్షేమ అధికారి అంజల, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీసీపీఓ దినేష్‌కుమార్, డీఈఓ కిరణ్‌కుమార్, సార్డ్స్, బచ్‌పన్ బచావో ఆందోళన్, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షణికావేశం.. తీసింది ప్రాణం

- కుటుంబ కలహాల నేపథ్యంలో కానిస్టేబుల్ ఆత్మహత్య


కానిస్టేబుల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సై


మస్తాన్(ఫైల్)

మార్కాపురం రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో నివాసముంటూ మార్కాపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వేముల మస్తాన్(32) ఉరేసుకుని మృతి చెందారు. మస్తాన్ ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వచ్చి భోజనం చేసిన తర్వాత భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. దీంతో భార్య, పిల్లలు అదే గ్రామంలో ఉంటున్న వారి బంధువుల ఇంటికి వెళ్లారు. మస్తాన్ తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్షణికావేశానికి లోనైన మస్తాన్ ఆత్మహత్యకు పాల్పడటం బంధుమిత్రులను కలచివేసింది. ఆయనకు భార్య, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. విధి నిర్వహణలో అధికారుల ప్రశంసలు పొందిన మస్తాన్ డీఎస్పీ కార్యాలయంలో కంప్యూటర్ వర్క్ చేసేవారు. ఇలా ఎందుకు చేశాడో అర్థం కావడంలేదని తల్లిదండ్రులు కొండయ్య, వీరమ్మ విలపిస్తున్నారు. మార్కాపురం సీఐ సుబ్బారావు, రూరల్ ఇన్‌చార్జి ఎస్సై సైదుబాబు, సిబ్బంది వెళ్లి మస్తాన్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీస్ శాఖ తరపున ఎస్పీ దామోదర్ మంజూరు చేసిన లక్ష రూపాయల చెక్కు, రూ.15 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

గుండె పోటుతో మరో ఇద్దరు..


చలపతిరావు(ఫైల్)


కోమటినేని విజయకృష్ణ(ఫైల్)

ఒంగోలు టౌన్: జిల్లాలో ఒకే రోజు ముగ్గురు కానిస్టేబుళ్లు మరణించడం పోలీసు శాఖలో కలకలం సృష్టించింది. కుటుంబ కలహాలతో ఒక కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడగా మరో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు గుండెపోటుతో మరణించారు.

- ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఎం.చలపతిరావు సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. శ్వాసకోశ సమస్య, గుండె జబ్బుతో బాధపడుతున్న ఆయనను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మేదరమెట్ల వద్ద కన్నుమూశారు. దీంతో మృతదేహాన్ని మంగమూరులోని స్వగృహానికి తరలించారు. మరికాసేపటికే మార్కాపురం టౌన్ కానిస్టేబుల్ జి.మస్తాన్ కుటుంబ కలహాలతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన వార్త బయటకొచ్చింది. ఈ రెండు ఘటనల గురించి పోలీసులు చర్చించుకుంటుండగానే ఒంగోలు మార్కెట్ యార్డులో గార్డుగా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కోమటినేని విజయకృష్ణ(45) గుండెపోటుకు గురయ్యారు. మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లిన కాసేపటికే ఛాతీలో నొప్పిగా ఉందంటూ వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కొత్తపట్నం బస్టాండ్ సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మూడు సంఘటనలు వరుసగా తెలియడంతో పోలీసులు కలతచెందారు. కానిస్టేబుళ్ల మృతికి ఎస్పీ ఏఆర్ దామోదర్ సంతాపం ప్రకటించారు.

కరాటేలో కానిస్టేబుల్‌కు గోల్డ్ మెడల్


కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: తిరుపతిలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించిన ఫస్ట్ ఓపెన్ సౌత్ ఇండియా చాంపియన్‌షిప్–2024లో ఏపీ పోలీసు శాఖ నుంచి కరాటే పోటీల్లో పాల్గొన్న కానిస్టేబుల్ పి.కరిముల్లాఖాన్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ సోమవారం అతన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే కరాటే సాధన చేస్తూ జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడం గొప్ప విషయమని అన్నారు. జిల్లాకు చెందిన కానిస్టేబుల్ బంగారు పతకం సాధించడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఆర్ఐలు రమేష్‌కృష్ణన్, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధనకు కృషి


మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఒంగోలు వన్‌టౌన్: దేశంలో ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు సాధించేందుకు కృషి చేస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్ద మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కింది కోర్టుల్లో రిజర్వేషన్లు అమలవుతున్నా రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం, సుప్రీంకోర్టులో ఆ పరిస్థితి లేదన్నారు. రాజ్యసభ, శాసన మండలిలోనూ రిజర్వేషన్ల కోసం పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. మాదిగలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఇది మూడో విజయమన్నారు. రెండు సార్లు సోదరులు అడ్డుకున్నారన్నారు. ప్రకాశం జిల్లా నుంచే ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమైందని చెప్పారు. భూమిని దళితులకు పంచితేనే రాజ్యాధికారం సాకారం అవుతుందన్నారు. ఐక్యత కోసం మాల సోదరులు కలిసి రావాలన్నారు. ముందుగా నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఆలయ భూముల్లో ఆక్రమణల తొలగింపు

- మరికొందరికి నోటీసులు ఇచ్చిన అధికారులు


దేవస్థాన భూమిలో నిర్మాణాన్ని కూల్చివేసిన అధికారులు

మార్కాపురం టౌన్: స్థానిక లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ భూముల్లో ఆక్రమణలను పోలీసుల పహారాలో దేవస్థాన అధికారులు సోమవారం తొలగించారు. పట్టణ శివారులోని మార్కెట్ యార్డు వై జంక్షన్ వద్ద కాటా దుకాణం, పాత ఇనప కొట్టును జేసీబీలతో కూల్చారు. మార్కాపురం సర్వే నంబర్ 206లో దేవస్థానానికి 1.75 ఎకరాల భూమి ఉంది. ఇందులో 0.65 సెంట్ల స్థలంలో ఒకరు లారీ కాటా, 0.45 సెంట్ల స్థలంలో మరొకరు పాత ఇనప కొట్టు ఏర్పాటు చేసుకున్నారు. వీరికి నోటీసులు జారీ చేసిన ఆలయ అధికారులు గడువు ముగియగానే కూల్చేశారు. అలాగే పట్టణంతోపాటు, బోడపాడు ఇలాకాలో ఆక్రమణలు గుర్తించి 17 మందికి నోటీసులు ఇచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు తెలిపారు. వారి నుంచి సరైన సంజాయిషీ రాకపోతే ఆక్రమణలు కూల్చేస్తామని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఐ సుబ్బారావు, ఎస్సైలు, పోలీసు, రెవెన్యూ, దేవస్థాన సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులతో కలెక్టర్


ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల తాలూకా సమస్యలను సకాలంలో పరిష్కరించడంతో పాటు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు ఒంగోలు వస్తారని, అర్జీదారుల సంతృప్తి స్థాయి పెరిగేలా ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి వివరించాలన్నారు. ఏ సమస్యా పునరావృతం కాకుండా చూడాలన్నారు. మండల స్థాయిలోనే ప్రజాసమస్యల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రచురించిన గోడ పత్రికలతో పాటు క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్యారోగ్య శాఖ ప్రచురించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వసుంధర, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, డీపీఓ వెంకట నాయుడు, డీఎంహెచ్ఓ సురేష్, సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యల్లో కొన్ని...

- డీఆర్‌డీఏ వెలుగులో పనిచేస్తూ విధుల నుంచి తొలగించిన పలు మండలాలకు చెందిన వీఓఏలు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిశారు. తమను అన్యాయంగా విధుల నుంచి తొలగించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి తీర్మానాలు లేకుండా తొలగించారని, తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పామూరు, టంగుటూరు, జరుగుమల్లి, పీసీ పల్లి మండలాల వీఓఏలు ఉన్నారు.
- మాస్ కమ్యూనికేషన్ అధ్యక్షుడు శివాజీ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి నగరపాలక సంస్థ పరిధిలోని కొప్పోలు రోడ్డు, రాజీవ్ గృహకల్పలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. రోగులకు వైద్యసేవలు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వైద్యులు, సిబ్బంది సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.
- సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలేనికి చెందిన కె.భానుప్రకాష్ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిశారు. తాను వికలాంగుడినని, పింఛన్ కోసం ఎన్నిసార్లు అధికారులను కలిసినా ఆన్‌లైన్ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. వికలాంగుడిని కావడంతో కటుంబ పోషణ కష్టంగా ఉందని, పరిశీలించి త్వరగా పింఛన్ మంజూరు చేయించాలని కోరారు.

మాజీ సర్పంచ్ నుంచి నిధుల రికవరీకి ఆదేశాలు

సంతనూతలపాడు: మండల కేంద్రమైన సంతనూతలపాడు గ్రామ సర్పంచ్‌గా 2013–18లో పనిచేసిన ఆర్.అంకారావు నుంచి నిధులు రికవరీ చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. అంకారావు సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ కుంచాల వీరబ్రహ్మయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దానిపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఆ నివేదిక మేరకు ఏపీ రికవరీ యాక్టు 1964 ప్రకారం అంకారావు 30,48,373 రూపాయలను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని, ఆ మొత్తాన్ని రికవరీ చేయడంతో పాటు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డివిజనల్ పంచాయతీ ఆఫీసర్, సంతనూతలపాడు ఈఓఆర్డీలను కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు ప్రొసీడింగ్ ఆర్డర్స్ జారీ చేశారు.